**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేది : 25 జూలై, 2024.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర నాయకత్వ బృందం ఈరోజు (25 జూలై) రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిని కలిసి ప్రజా సమస్యలపై మెమోరాండం సమర్పించింది. ఆ కాపీని ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**విషయం : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి...**

**అయ్యా!**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మీకు శుభాకాంక్షలు.

మీ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని ఆశిస్తున్నాము.

మీరు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డిఎస్సీ వంటి ఐదు ముఖ్యమైన ఫైల్స్‌పై సంతకం చేసి అమల్లోకి తీసుకురావడాన్ని హర్షిస్తున్నాము.

ఎన్నికల క్యాంపెయిన్‌లోనూ, ప్రణాళికలోనూ 'సూపర్ 6'తో సహా కొన్ని వాగ్దానాలు అమలు జరిపేందుకు కాల పరిమితితో కూడిన షెడ్యూలును ప్రకటించగలరని కోరుతున్నాము. దీర్ఘ కాలిక ప్రణాళికలతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ఈ ఐదు సంవత్సరాలలో అమలు చేయగలిగిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని కోరుచున్నాము.

**<u>కేంద్రం నుండి సాధించాల్సినవి:</u>**

**(1)** రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగింది. దాన్ని సరిదిద్దేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాను ఇస్తామని పార్లమెంట్‌లో ప్రకటించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కూడా ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసింది. కానీ అది ఇంతవరకు ఆచరణ రూపం ధరించలేదు. ఈ హామీకి విరుద్ధంగా పార్లమెంటులో ప్రత్యేక హోదా ఇవ్వలేమని పదే పదే ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో కూడా మీరు భాగస్వామిగా ఉన్నందువల్ల ప్రత్యేక హోదాను పట్టు పట్టి సాధించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. మన రాష్ట్ర అభివృద్ధికి ఇది ఎంతో కీలకమైన విషయం.

**(2)** రాష్ట్ర విభజన సందర్భంగా ప్రకటించిన అనేక పథకాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు, దాని నిర్మాణంలో ముఖ్యభాగమైన నిర్వాసితుల పునరావాసానికి నిధులు, రాజధాని నిర్మాణం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్, కేంద్ర విద్యా సంస్థలు ఇంతవరకు పూర్తి కాలేదు. అవసరమైన నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్‌లోనైనా న్యాయం జరుగుతుందనుకుంటే నిరాశ మిగిలింది. కావున మీ ప్రభుత్వం తరపున శ్రద్ధ తీసుకొని అన్ని పక్షాలను కూడగట్టి కేంద్రం నుండి సత్వర న్యాయం జరిగేటట్లు చూడగలరు.

**(3)** అంతర్రాష్ట్ర సమస్యలు ప్రత్యేకించి తెలంగాణతో ఉన్న సమస్యలు నీటి వాటాలు, ఆస్తి పంపిణీ, ఉద్యోగుల విభజన తదితర అంశాలపై రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మీరు శ్రద్ధ తీసుకుని ప్రారంభించిన చర్చలను ఆహ్వానిస్తున్నాము. వీటిని కొనసాగించి త్వరగా పరిష్కారం చేసుకోవడం అవసరం.

**(4)** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకునేటట్లు ఒత్తిడి చేయాలి. సొంత గనులు కేటాయించాలి. పెట్టుబడి సమకూర్చాలి. కేంద్రంపై ఒత్తిడి చేస్తూనే రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న గనులను కేటాయించాలి. రుణ సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలి. ప్రైవేటీకరణ జరగకుండా లాభాల బాటలో నడిపేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాపాడాలని కోరుచున్నాము.

**(5)** రాష్ట్రంలో మతోన్మాదం పెచ్చరిల్లె ప్రమాదం పెరిగింది. రాజ్యాంగ మూల స్తంభాలైనా లౌకిక తత్వం, ఫెడరలిజం, ప్రజాస్వామిక వ్యవస్థలను, పద్ధతులను గౌరవించి తూచా తప్పకుండా అమలు జరిపేందుకు మీ ప్రభుత్వం కృషి చేయాలని కోరుచున్నాము. గతంలో ప్రతిపక్షంలో ఉండగా మీరు ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేయదలిచాము.

పై అంశాల సాధన కోసం మీరు చేసే పోరాటానికి మా పార్టీ మద్దతు ఉంటుందనీ మనవి చేస్తున్నాము.

**రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానాలను కాల పరిమితితో ప్రణాళికాబద్దంగా అమలు చేయాలి.**

**(1)** రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయటానికి ప్రాధాన్యత నివ్వాలి. వెనకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేయాలి.

**(2)** పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం, అలాగే రాజ్యాంగం 5వ షెడ్యూలు నిబంధనల ప్రకారం భూమికి భూమితో పాటు నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీ తాజాపరిచి అమలు చేయాలి. ప్రస్తుతం 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. షెడ్యూల్ ప్రాంతంలోనే వారికి కాలనీలు నాణ్యత కలిగినవి కట్టించి ఇవ్వాలి. కాలనీలలో నివాసయోగ్యమైన సౌకర్యాలు అన్నిటిని కల్పించాలి.

**(3)** అమరావతి రాజధాని నిర్మాణాన్ని వచ్చే ఐదేళ్లలో ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసి తక్షణ పరిపాలన సౌలభ్యంగా ఉండే విధంగా చేపట్టాలి. మరొకసారి రాజధాని వివాదం కాకుండా చట్టబద్ధ చర్యలు తీసుకోవాలి.

**(4)** గత ఎన్నికల్లో మీరు వాగ్దానం చేసినట్లుగా ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ యువతకు లాభం చేసే జీవో నెం.3ని పునరుద్ధరించి ప్రత్యేక డిఎస్సి నిర్వహించాలి. వందలాదిగా ఉన్న భాషా వాలంటీర్లను రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలి. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలి.

**(5)** వ్యవసాయ అభివృద్ధి కోసం ధరల స్థిరీకరణ నిధి కోసం 5 వేల కోట్లు కేటాయించాలి. ఉచిత పంటల భీమా అమలు చేయాలి. సహకార వ్యవస్థను పటిష్ట పరచాలి. పాల సేకరణలో అమూల్ జోక్యాన్ని నిలిపివేసి సహకార సంఘాల ద్వారా చేయాలి. సహకార చక్కెర ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించాలి.

**(6)** జీవో నెంబర్ 596ను రద్దు చేసి 9/77 ప్రకారం అసైన్డ్ భూములను అసలు లబ్ధిదారులైన పేదలకు కేటాయించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ, నిరుపయోగంగా ఉన్న మరియు మిగులు భూములను పంచాలి. పరిశ్రమలు పెట్టకుండా ఖాళీగా ఉన్న భూములను వెనక్కి తీసుకొని పేదలకు ఇవ్వాలి.

**(7)** కౌలు రైతుల సంక్షేమానికి గుర్తింపు కార్డుల కోసం 2019 కౌలుదారి చట్ట సవరణ రద్దుచేసి భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. 2011 చట్టాన్ని పునరుద్ధరించాలి. కౌలు రైతులకే నేరుగా సొంతపూచికత్తుపై పంట రుణాలు ఇవ్వాలి. నష్టపోయిన సందర్భాల్లో పరిహారం కౌలురైతులకే ఇవ్వాలి.

**(8)** గత ప్రభుత్వం అసంపూర్ణంగా వదిలేసిన ఇళ్ల కాలనీల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. టిట్కో లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించాలి.

**(9)** వివిధ షెడ్యూల్డ్ రంగాలలో ఉన్న అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా ప్రకటించాలి. కనీస వేతనాల సలహా బోర్డును పునరుద్దరించాలి. కార్మిక చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలి. పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలి. భవన నిర్మాణ కార్మికులు సహా అన్ని రకాల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలి. ఎన్నికలకు ముందు జరిగిన అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ తదితర రంగాల ఒప్పందాలను గౌరవించి ఆయా సంఘాలతో చర్చించి వేతనాలను పెంచాలి.

**(10)** ఎన్నికల్లో ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మీకు సంపూర్ణ మద్దతునిచ్చారు. వారి ఆశలకు అనుగుణంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి.

(11) అత్యంత పేదలు, బలహీనవర్గాలకు చెందిన చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. రాజకీయ కారణాలతో తొలగింపులు/ వేధింపులు తక్షణం ఆపాలి.

(12) రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించాలి. రాష్ట్ర, జిల్లా ఎస్సీ మానిటరింగ్ కమిటీలను ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశపరచాలి. దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. ట్రైబల్ అడ్వజరీ కమిటీ (టిఎసి)ని చురుగ్గా పనిచేయించాలి.

(13) మహిళలపై అత్యాచారాల నిరోధానికి, అలాంటి కేసుల్లో సత్వర న్యాయం జరిగేందుకు నిర్భయ చట్టం కచ్చితంగా అమలు జరపాలి. దశలవారీ మద్య నిషేధాన్ని అమలు చేయాలి. గంజాయి పూర్తిగా నిర్మూలించాలి.

(14) గత ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసిన 117వ జీవోను రద్దు చేయాలి. మెడికల్ కాలేజీలలో కౌన్సిలింగ్ సీట్ల సంఖ్యను పెంచాలి. కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ మరియు ఎన్ఆర్ఐ సీట్లకు అవకాశం కల్పిస్తున్న జి.వో.నెం.107,108లను రద్దు చేయాలి.

(15) వృత్తి దారులకు సబ్సిడీతో కూడిన కార్పొరేషన్ రుణాలు అందించాలి. వృత్తిని ఆధునికరించే పరికరాలను చౌకగా అందించాలి.

(16) పోలవరం, స్మార్ట్ మీటర్లు, మద్యం, ఇసుక, భూదందాలు తదితర అంశాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

(17) వివిధ ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి. శాంతియుతంగా చేసే ఆందోళనలను నిర్బంధంగా అణిచివేసే పద్ధతులకు స్వస్తి చెప్పి ఆయా తరగతుల, రంగాలతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యలు పరిష్కరించాలి.

(18) స్థానిక సంస్థలకు న్యాయంగా రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలి. ధ్వంసమైన గ్రామీణ రోడ్లను బాగు చేయాలి. పట్టణాలలో డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలి. దోమలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. చెత్తపన్ను రద్దు ఆదేశాలు ఇవ్వాలి. ఆస్తి విలువ ఆధారిత ఇంటిపన్ను విధానం రద్దు చేయాలి.

(19) ఉపాధి హామీ పథకంలో కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి.

(20) టిడిపి ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా విద్యుత్ ఛార్జీలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. ట్రూఅప్‌ఛార్జీలు రద్దు చేయాలి. పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టు, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి.

(21) భూసేకరణలో 2013 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. గతంలో చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలి. గ్రామ సభలు నిర్వహించకుండా ఆదివాసీలు, రైతుల భూములను బలవంతంగా తీసుకోరాదు.

(22) మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి. వీటిని రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి.

పై సమస్యల పరిష్కారానికి మీ ప్రభుత్వం చొరవ తీసుకొని కృషి చేయాలని కోరుతున్నాము. మీకున్న సుదీర్ఘ పాలనా అనుభవాన్ని జోడించి సుపరిపాలన అందించగలరని ఆశిస్తున్నాము.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి

**(యం.ఎ.గఫూర్)**
కేంద్ర కమిటీ సభ్యులు

**(వై.వెంకటేశ్వరరావు)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**(సిహెచ్.బాబూరావు)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**(కె.ప్రభాకర్‌రెడ్డి)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు